క్లుప్తంగా

సచివాలయం తనిఖీ



రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సైదాపురం: మండలంలోని కలిచేడు సచివాలయాన్ని శనివారం ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తప్పనిసరిగా విధుల్లో ఉండాలన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని ఆదేశించారు. స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఏకొల్లులో ఆధార్ సేవలు

దొరవారిసత్రం: ఏకొల్లు సచివాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపులో 30 మంది సేవలు పొందారు. కొంత మంది కొత్త ఆధార్ కోసం దరఖాస్తు చేసుకోగా మరి కొంత మంది ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకున్నట్లు కార్యదర్శి రామయ్య తెలిపారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ



దొరవారిసత్రం: నెలబల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 3లో సుమారు 3 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానికులు ఆక్రమించి, సాగుకు సిద్ధం చేసిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ భూ ఆక్రమణ విషయంలో కూడా రెండు వర్గాల మధ్య వివాదాలు చోటు చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోపోతే ఘర్షణలు చోటు చేసుకుంటాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. నెలబల్లి పంచాయతీ కలగుంట ఎస్టీ సమీపంలోని సర్వే నంబర్ 364, 365లోని మిగులు ప్రభుత్వ భూమి సుమారు రెండు ఎకరాల వరకు గత నెలలో స్థానికులు ఆక్రమించడంతో రెవెన్యూ అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కాని ఆ హెచ్చరిక బోర్డులను గుట్టుచప్పుడు కాకుండా ఆక్రమణ దారులు తొలిగించి, యథావిధిగా రాత్రికి రాత్రి సాగుకు అనువుగా దున్నినట్లు కాలనీవాసులు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామికి పల్లకీ సేవ

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం పల్లకీ సేవ నిర్వహించారు. ఉదయం స్వామివారికి పలు రకాల అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ ఆనంద్‌బాబు, ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

అవగాహన అవసరం

వెంకటగిరిరూరల్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాదులు రాజారాం, అనుపమ్మ, వాసులు తెలిపారు. పట్టణంలోని విశ్వోదయ డిగ్రీ కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కళాశాలల్లో ర్యాగింగ్ కారణంగా కొందరు విద్యార్థులు మరణించిన ఘటనలున్నాయన్నారు. ఇలాంటి చర్యలు పాల్పడకుండా క్రమశిక్షణతో చదువుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వెంకటగిరిరూరల్: గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, పరిష్కారానికి తన వంతు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు గిరిజన సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల మల్లికార్జున్ తెలిపారు. బాలాయపల్లె మండలంలోని భైరవరం గిరిజన కాలనీని శనివారం ఆయన సందర్శించి, స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ఆ ప్రాంతంలో గిరిజనులకు ఇళ్లు, రోడ్లు, కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

తడ: పెళ్లయిన ఏడాదికే అధిక కట్నం కోసం భర్త, ఆయన తరఫు బంధువులు వేధింపులకు పాల్పడుతున్నారని వేనాడు పంచాయతీ, మూల గ్రామానికి చెందిన ఓ యువతి తడ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మూల గ్రామానికి చెందిన ముక్కు వైదేహికి గత ఏడాది డిసెంబర్ 5వ తేదీన అదే గ్రామానికి చెందిన రాజశేఖర్‌తో వివాహం జరిగింది. ఆ సమయంలో కట్న, కానుకలు ఇచ్చారు. పెళ్లయిన కొద్ది రోజుల అనంతరం అధికంగా మరో రూ.5 లక్షల నగదు, 10 సవర్ల బంగారం తీసుకురావాలంటూ వైదేహి భర్త రాజశేఖర్‌తోపాటు బావ రాజేంద్రప్రసాద్, అత్త మురారి వేధించసాగారు. వేధింపులు తాళలేక పది రోజుల క్రితం వైదేహి పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నెల 20వ తేదీన భర్త, బావ, అత్తలు కలిసి వైదేహి పుట్టింటికి వచ్చి బాధితురాలి తండ్రి, పెదనాన్న, చిన్నాన్నలతో గొడవ పెట్టుకుని వారిని కొట్టి వెళ్లిపోయారు. కాపురానికి తీసుకు వెళ్లేందుకు వస్తారన్న ఉద్దేశంతో ఎదురు చూసినప్పటికీ ఫలితం లేకపోవడంతో శనివారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జేపీ శ్రీనివాసరెడ్డి తెలిపారు.





పంట పొలాల్లో నుంచి తాగు నీళ్లు తెచ్చుకుంటున్న కల్లూరుకండ్రిగ వాసులు

ఇదో తాగునీటి కథ

నేల బావులు.. నేడు దాదాపు కనుమరుగు.. ఉన్న ఒకటీ..అరా.. పాడుబడి పోయాయి.. అయినా సరే ఓల్డ్ ఈజ్ గోల్డ్ చందంగా కొన్ని పల్లెల్లో వందల కుటుంబాలు ఆ నీటివనరులపైనే ఆధారపడుతున్నారు.. ఆ పల్లెల్లో నీటి సమస్యతోనో..లేక రక్షిత మంచినీటి పథకాలు లేకనో కాదు.. బావుల్లోని నీరే రుచిగా ఉంటుందని, వాటితో వంట చేస్తే నాణ్యతగా ఉంటుందని.. అవి తాగితేనే దప్పిక తీరుందన్నది వారి నమ్మకం. ఇదీ దొరవారిసత్రం మండలంలోని కొన్ని ఊళ్ల తాగునీటి కథ.

- సురక్షిత నీటిని వదిలి.. నేలబావి వైపు..
- 50 ఏళ్లుగా నేలబావుల్లోని నీరే వినియోగం

దొరవారిసత్రం: మండలంలోని కొన్ని గ్రామాల్లోని వందల కుటుంబాలు నేలబావుల్లో నీటిని నేటికీ వినియోగిస్తున్నాయి. ప్రతి గ్రామంలో మంచి నీటి పథకాలున్నా.. వాటిని వదిలి బావుల్లోని నీరు తాగితేనే దాహం తీరుందని కొందరు అంటుంటే, మరికొందరు మాత్రం బావిలోని నీటితో అన్నం వండుకుంటే రెండో రోజైన అన్నం పాడవకుండా ఉంటుందని అంటున్నారు. ఏదిఏమైనా కొన్నేళ్లుగా నేలబావుల్లోని నీటినే తమ అవసరాలకు వినియోగిస్తూ ఎంతో ఆరోగ్యంగా ఉంటున్నారు.

మంచి నీటి పథకాలున్నా...

దొరవారిసత్రం మండలంలోని కుగ్రామాలతో కలిపి 65 గ్రామాలున్నాయి. 100కి పైగా బావులు, చేతి బోర్లు 300 వరకు వాడుకలో ఉండేవి. ప్రస్తుతం మంచి నీటి పథకాలు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పరిధిలో పీడబ్ల్యూఎస్, ఎంపీడబ్ల్యూఎస్ కలిపి మొత్తం 85 మంచి నీటి పథకాలు అందుబాటులో ఉన్నాయి. దీంతో క్రమేపీ ఈ బావులన్నీ సుమారు 15 ఏళ్ల కిందటే నిరుపయోగంగా మారడంతో అధిక మొత్తంలో గ్రామాల మధ్యలో ఉన్న బావులను పూడ్చేశారు. అదే తరహాలో చేతి బోర్లను వాడకుండా వదిలిపెట్టడంతో నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరాయి. అయితే ప్రస్తుతం ఆనేపూడి, ఆనేగొట్టం, కట్టువాపల్లె, కేపీవీ కండ్రిగ, కొత్తపల్లె తదితర గ్రామాల్లో పది బావుల వరకు వినియోగంలో ఉన్నాయి.



కల్లూరుకండ్రిగ పంట పొలాల్లోని నేలబావిలో నీటి తోడుకుంటున్న మహిళలు

50 ఏళ్లుగా నేలబావుల్లోని నీరే..

అంటువ్యాధులు వస్తాయనే ఆలోచన కూడా లేకుండా కల్లూరు సచివాలయ పరిధిలోని కల్లూరుకండ్రిగలో సుమారు 120 కుటుంబాలు, నెలబల్లి సచివాలయం పరిధిలోని నేలపట్టు ఎస్సీ కాలనీ, మైలాంగం గ్రామం, ఎస్సీ కాలనీల్లోని సుమారు 250 కుటుంబాల ప్రజలకు నేలబావుల్లోని నీటినే గత 50 ఏళ్లుగా తాగునీటిగా, వంటావార్పుకు వినియోగించుకుంటున్నారు. ఆయా గ్రామాల్లో నీటి పథకాలున్నా వాటిపై మొగ్గు చూపడంలేదు. కల్లూరుకండ్రిగ గ్రామానికి సుమారు కిలోమీటర్ దూరంలోని పంట పొలాల మధ్యలో ఉన్న నేలబావిలో అడుగంటిన నీటినే తాగేందుకు మక్కువ చూపుతున్నారు. అలాగే నేలపట్టు ఎస్సీ కాలనీ మైలాంగం గ్రామాల మధ్య ఉన్న కుక్కలగుంట చెరువు పడమర భాగంలో నేలబావిలోని నీటినే ఇక్కడ వారు ఉదయం, సాయంత్రం విధిగా తెచ్చుకుని తాగడంతో పాటు వంటావార్పుకు వినియోగించుకుంటున్నారు.

ఈ నీళ్లు తాగితే వేడి చేయదు



“ కల్లూరుకండ్రిగ సమీపంలోని నేలబావిలోని నీళ్లు తాగితే శరీరం వేడి చేయకుండా ఉంటుంది. అదే గ్రామంలోని మంచి నీటి పథకం నీళ్లు తాగితే వేడి చేసి అనారోగ్యం పాలవుతున్నాం. అందువలనే కొన్నేళ్లుగా నేలబావిలోని నీటినే గ్రామంలోని అందరం తాగునీటిగా వాడుకుంటున్నాం.

– సగిలి కల్పన, కల్లూరుకండ్రిగ గ్రామం

పథకం నీళ్లు బాగుండవు



నేలపట్టు ఎస్సీ కాలనీలో పథకం నీళ్లు వచ్చినా బాగుండవు. అందువలనే నేల బావిలోని నీటినే కష్టమైన తెచ్చుకుని తాగేందుకు, వంటావార్పుకు వాడుకుంటాం. బావిలోని నీళ్లను కనీసం వడకట్టకుండానే అందరం వినియోగించుకుంటాం. అయినా ఆరోగ్యంగా ఉన్నాం.

– కల్లపూడి చెంగమ్మ, నేలపట్టు ఎస్సీ కాలనీ

అన్నం బాగుంటుంది



మంచి నీటి పథకం నీళ్లతోనే వంటావార్పు చేస్తే రుచిగా ఉండదు. దీంతో పాటు రాత్రి వండిన అన్నం కూడా ఉదయానికి మొత్తపడి తినేందుకు బాగుండదు. అందువలనే బావిలోని నీటితోనే కచ్చితంగా అన్నం వండుకుంటాం. బావి నీటితో వంట చేస్తే అన్నం ఉదయానికి మొత్తపడదు. చద్దన్నం తినేందుకు చాలా బాగుటుంది.

– పంచేటి లక్ష్మి, మైలాంగం ఎస్సీ కాలనీ

నేడు జాబ్‌మేళా

సూళ్లూరుపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం జాబ్‌మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ తెలిపారు. శ్రీసిటీ సెజ్‌లోని బ్లూ ఓషన్ కంపెనీలో పనిచేయడానికి పదో తరగతి పాస్ లేదా ఫెయిల్, ఐటీఐ చదువుకున్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. 18– 35 ఏళ్లలోపు ఉన్న అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. అర్హులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటో లతో నేరుగా డిగ్రీ కళాశాల వద్దకు రావాలన్నా రు.

పకడ్బందీగా ఆరోగ్య సురక్ష



పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

సైదాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ జనార్దన్ సూచించారు. మండలంలోని చాగణంలో శనివారం వలంటీర్‌తో కలిసి వైద్య సిబ్బంది సర్వే చేపట్టారు. వైద్యులు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష రోగుల పాలిట వరమన్నారు.

గృహసారథులకు అవగాహన

దొరవారిసత్రం: ఏకొల్లు సచివాలయంలో శనివారం గృహసారథులు, వలంటీర్లుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి రామయ్య మాట్లాడుతూ ఏకొల్లు సచివాయ పరిధిలో ఈ నెల 27వ తేదీ నుంచి వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుని, యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. మండల కోఆర్డినేటర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దాత

వెంకటగిరిరూరల్: మృతురాలి కుటుంబానికి దాతలు ఆర్థిక సాయం చేశారు. బొగ్గలమిట్టలో ఉన్న చేనేత కుటుంబానికి చెందిన సుంకర రాజేశ్వరి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ క్రమంలో ఎనీవ్రఆర్ చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేశారు. ఎం శ్రీనివాసులు, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి..సంక్షేమం రెండు కళ్లు



సైదాపురం - పొదలకూరు రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి.. సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కలిచేడులో శనివారం రూ.45 కోట్లతో సైదాపురం - పొదలకూరు రహదారి అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలిచేడు, తురిమెర్ల, ఊటుకూరు, సైదాపురం గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 107 సచివాలయాల పరిధిలో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి రూ.40 కోట్ల నిధులు త్వరలోనే విడుదల కానున్నట్లు చెప్పారు.

సైదాపురం నుంచే ఎన్నికల శంఖారావం

సైదాపురం మండలం నుంచే నియోజకవర్గ ఎన్నికల శంఖారావం పూరిస్తున్నట్లు నేదురుమల్లి పేర్కొన్నారు. శనివారం నుంచే నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఆయన కలిచేడులోని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలలను పరిశీలించి, స్కూలు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవికుమార్‌యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు వీ ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జీ శ్రీనివాసులురాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు జీ శివకుమార్, వైస్ ఎంపీపీ భాస్కర్, నేతలు రాంగోపాల్‌రెడ్డి, అబ్బిరాజు, మాలకొండారెడ్డి, రాఘవరెడ్డి, ఆదిశేషయ్య, చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, రాజశేఖర్, రాధరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడి



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త

వెంకటగిరిరూరల్: పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గోవిందరాజులు పేర్కొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం దత్తత గ్రామమైన బాలాయపల్లె మండలం పల్లిపాడు, మన్నూరు సచివాలయాల్లో గ్రామ వనరుల సంరక్షణ, ఉద్యానవన పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారుల సమన్వయంతో సమగ్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. ఏడీఏ నాగార్జున సాగర్, పశుసంవర్ధక వీఏఎస్ సుధీర్, ఉద్యానవన శాఖాధికారి ఆనంద్, కేవీకే శాస్త్రవేత్త విజయశ్రీ, తిరుపాల్, నాగార్జునరెడ్డి, రాజీవన తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా తీర్థంలో వెంకయ్యస్వామి ఆరాధన

దక్కిలి: మండలంలోని దగ్గవోలులో ఉన్న తీర్థం వెంకయ్యస్వామి ద్వితీయ ఆరాధన మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఉదయం స్వామివారికి అష్టోత్తర శతనామావళి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం చేశారు. సాయంత్రం దగ్గవోలు నవరత్నాల భజన బృందం అధ్వర్యంలో భజన కీర్తనలు, కోలాటం నిర్వహించారు. రాత్రి పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు. రాత్రి వెంకయ్యస్వామి చిత్ర పటం ఊరేగించారు. ఆలయ పీఠాధిపతి రమణానందస్వామి ఏర్పాట్లు చేశారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు గూడూరు విద్యార్థులు



విహారిక



లిఖితైశ్వర్య

గూడూరురూరల్: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఇ.విహారిక స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 హాకీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మాధవీలక్ష్మి తెలిపారు. నెల్లూరులో జరిగిన జిల్లా స్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. అలాగే ఏడో తరగతి చదువుతున్న బి.లిఖితైశ్వర్య తైక్వాండో పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని, అక్టోబర్‌లో కడప జిల్లా పోరుమామిళ్లలో జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. శనివారం పాఠశాలలో క్రీడాకారులను హెచ్‌ఎంతో పాటు పీడీ విజయలక్ష్మి, ఉపాధ్యాయినిలు అభినందించారు.

జిల్లాస్థాయి పోటీలకు పెళ్లకూరు విద్యార్థులు

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం దొరస్వామి తెలిపారు. శనివారం సూళ్లూరుపేటలో జరిగిన నియోజకవర్గస్థాయి క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచి, జిల్లాస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరిలో ప్రవంతి (కబడ్డీ), నవీన్(వాలీబాల్), నిషాంత్, క్రాంతి(బ్యాడ్మింటన్) జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

చిల్లకూరు: ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న ప్రతి పనినీ ఇకపై ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఏపీడీ వరప్రసాద్‌రావు తెలిపారు. మండలంలోని ఉపాధి కార్యాలయంలో శనివారం ఆయన పలు రికార్డులు తనిఖీ చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన క్షేత్ర సహాయకులు చేపడుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇకపై గ్రామాల్లో చేపట్టే ప్రతి పని వివరం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, అలా చేయని పక్షంలో కూలీలకు కూడా నగదు చెల్లింపులు జరగవన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి క్షేత్ర సహాయకుడు తమ పనుల వివరాలను ఎప్పటికప్పుడు కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్లకు అందించాలని సూచించారు. రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన కల్పించి వారికి ఉపాధి ద్వారా లబ్ధి చేకూర్చేలా చూడాలన్నారు. ఆయన వెంట ఏపీఓ గిరి ఉన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏపీడీ వరప్రసాద్

ముగిసిన వేనాడు గంధోత్సవం

తడ: వేనాడులో ఉన్న షేక్ దావూద్ షావలీ అల్లాహ్ 28వ గంధోత్సవం శుక్రవారం రాత్రి గంధం సమర్పించడంతో ముగిసింది. దర్గా ముజావర్ ముష్తియార్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన గంధోత్సవంలో భాగంగా ఖవాలీ నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు దర్గాను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. దర్గాకు వచ్చిన భక్తులు దర్గాకు సమీపంలోనే ఉన్న బాబా చెల్లెలుగా భావించే వహీదాబీ దర్గాను కూడా దర్శించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



దర్గాపై పూల చద్దర్ కప్పుతున్న భక్తులు

కోలాహలంగా నిమజ్జనం



వాకాడు: విగ్రహం నిమజ్జనం చేస్తున్న భక్తులు

వాకాడు: పలు మండలాల్లో వినాయక చవిత సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను మూడో రోజు నుంచి తూపిలిపాళెం వద్ద ఉన్న బంగాళాఖాతంలో నిమజ్జనం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం కూడా సుమారు 500 విగ్రహాల వరకు నిమజ్జనం చేసినట్లు అధికారులు తెలిపారు.

వినాయకుడికి విశేష పూజలు

గూడూరురూరల్: పట్టణంలోని కమ్యూనిటీ హాలు ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి జైభీమ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశేష పూజలు, అన్నదానం చేశారు. మోదుగవనంలోనూ ప్రత్యేక పూజలు చేశారు.



వాకాడు: విగ్రహం నిమజ్జనం చేస్తున్న భక్తులు



చిల్లకూరు: ఉట్టి కొడుతున్న యువకులు

ఉట్టి ఉత్సవం.. యువకుల కేరింత

చిల్లకూరు: మండల కేంద్రంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉట్టి ఉత్సవం నిర్వహించారు. యువత ఉత్సాహంగా పాల్గొని, కేరింతలు నడుమ ఉట్టి కొట్టడానికి పోటీ పడ్డారు.

నేటి నుంచి మల్లాంలో బ్రహ్మోత్సవాలు

చిల్లకూరు(చిట్టమూరు): మల్లాం గ్రామంలో ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వస్వామి వారి ఆలయంలో ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఈఓ శశాంక్‌కుమార్ తెలిపారు. ఆదివారం విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుందన్నారు. అలాగే ఈ నెల 25వ తేదీన ధ్వజారోహణం, 29వ తేదీన ఫలాభిషేకం, నందిసేవ జరుగుతుందన్నారు. అలాగే 30న రథోత్సవం, అక్టోబర్ ఒకటో తేదీ షణ్ముగస్వామి కల్యాణం, 2న కల్యాణ రాయభారం, 3న కల్యాణం, 4న వసంతోత్సవం, 5న అలకలదోపు, 6న ఏకాంతసేవ నిర్వహిస్తున్నట్లు ఈఓ శశాంక్ కుమార్ తెలిపారు.

